4 | నమస్తే తెలంగాణ
హైదరాబాద్
బుధవారం 23 అక్టోబర్ 2024
www.ntnews.com

# వేదిక

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

**నమస్తే తెలంగాణ**

## పునర్విభజన చిక్కులు

*చిన్న కుటుంబం చింతలు లేని కుటుంబం అనే నినాదానికి కాలం చెల్లిపోయినట్టు కనిపిస్తున్నది. గంపెడు పిల్లల్ని కనడమే ఆదర్శం అవుతున్నది. ఒక్కో జంట పదహారు మంది పిల్లల్ని కనాలని తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ ఇచ్చిన పిలుపు దీనినే సూచిస్తున్నది. ఆ పిలుపు మరోసారి ఉత్తర, దక్షిణ తారతమ్యాల చర్చకు తెరలేపింది. నియోజకవర్గాల పునర్విభజనలో తమిళనాడుకు జరగబోయే నష్టాన్ని దృష్టిలో ఉంచుకొని ఆయన వ్యంగ్యంగా ఆ మాట అన్నప్పటికీ మొత్తంగా ఐదు దక్షిణ రాష్ట్రాలకు అది వర్తిస్తుంది. మేమిద్దరం మాకిద్దరు అనే సూత్రం చాలావరకు పాటించి దేశ జనాభా నియంత్రణకు దన్నుగా నిలిచిన దక్షిణాదికి ఒరిగిందేమిటి? జనాభా ప్రాతిపదికన పునర్విభజన జరుగుతుండటంతో ఉత్తరాదిలో లోక్‌సభ స్థానాల సంఖ్య భారీగా పెరుగుతుంది. అదే సమయంలో దక్షిణాదికి అరకొరగా మాత్రమే సీట్లు పెరుగుతాయి. దీని ఫలితంగా పార్లమెంటులో నిర్ణాయక పాత్ర పోషించే అవకాశాన్ని దక్షిణాది కోల్పోతుండటం అసలు కీలకం. 2026లో జరగనున్న పునర్విభజన కసరత్తులో మొత్తం స్థానాల సంఖ్య 543 నుంచి 753కు పెరుగుతుందని తెలియవస్తున్నది. అప్పటికి భారత్ జనాభా 142 కోట్లు అవుతుందని ఒక అంచనా. జన సంఖ్యను బట్టే పునర్విభజన ద్వారా నియోజకవర్గాలను పెంచుతారు. అయితే, ఈ పెరుగుదల అంతటా ఒకే తీరుగా ఉండదు. గరిష్ఠంగా లబ్ధి పొందనున్న యూపీలో ప్రస్తుతం 80 స్థానాలుంటే అవి 126కు పెరుగుతాయి. 50 శాతం పైగా స్థానాలు వచ్చి చేరుతాయి. బీహార్‌లో 30, మహారాష్ట్రలో 20, రాజస్థాన్‌లో 19, మధ్యప్రదేశ్‌లో 18 స్థానాలు పెరుగుతాయి. అదే తమిళనాడులో 39 కాస్తా రెండు పెరిగి 41 అవుతాయి. ఇక తెలంగాణ, ఏపీలకు చెరో మూడు లభిస్తాయి. దక్షిణాదిలో ఎక్కువగా పెరిగే కర్ణాటకలో 28 నుంచి 36 అవుతుంది. కేరళలో 20 నుంచి 19కి తగ్గడం మరీ దారుణం.*

*కేంద్ర ప్రభుత్వం డెబ్బయ్యో దశకంలో కుటుంబ నియంత్రణను విరివిగా ప్రచారం చేసింది. అధిక జనాభాతో సంక్రమించే సమస్యలను దూరం పెట్టేందుకు దానిని చేపట్టారనేది తెలిసిందే. విద్యా విషయకంగా ముందంజ సాధించి పరిమిత కుటుంబ లక్ష్యాలను సాధించిన దక్షిణాది ఆర్థికంగానూ దేశానికి అండగా నిలుస్తున్నది. ఇప్పటికీ వెనుకబాటుతనంలో మగ్గుతున్న ఉత్తరాది చదువుల్లో వెనుకబడిపోయింది. కుటుంబంపై పరిమితి లేకపోవడం వల్ల జనాభా నియంత్రణలో వెనుకబడిపోయింది. అంటే అక్కడ జనాభా ఎడాపెడా పెరిగిపోయిందన్న మాట. దీనివల్ల ఉత్తరాదికి జరిగే నష్టం ఏమీ లేదు. పైగా లాభపడుతున్నది కూడా. ఉత్తర, దక్షిణ వ్యత్యాసాల్లో ఆర్థిక కోణాలూ ఉన్నాయనేది దృష్టిలో ఉంచుకోవాలి. ఆర్థికంగా సత్వర అభివృద్ధి సాధిస్తున్న దక్షిణాది ఎక్కువ పన్నులు చెల్లిస్తుంది. కానీ, ఆ సొమ్ము అధికంగా ఖర్చయ్యేది ఉత్తరాదిలోనే. ఆదాయాన్ని బట్టి పన్నులు వేసి, జనాభాను బట్టి నిధులు ఖర్చుచేసే సంప్రదాయం అందుకు కారణం.*

*పైన తెలిపిన కారణాల వల్ల దక్షిణాది రాష్ట్రాలు పునర్విభజనను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. జనాభా నియంత్రణను పటిష్ఠంగా అమలుచేసినందుకు మా రాష్ట్రాన్ని శిక్షిస్తారా? అని తమిళనాడుతో పాటుగా దక్షిణాది రాష్ట్రాలన్నీ మొదటినుంచీ ప్రతిఘటిస్తున్నాయి. ఇప్పటిదాకా నాలుగు సార్లు పునర్విభజన కమిషన్లు ఏర్పాటైనా ఏమీ జరుగలేదు. అయితే ఈసారి ఎలాగైనా సాధించి తీరాలనే పట్టుదలతో కేంద్ర పాలక పక్షమైన బీజేపీ దూకుడుగా పోతున్నది. ఉత్తరాదిలో బాగా విస్తరించి దక్షిణాదిలో పట్టు సాధించేందుకు తంటాలు పడుతున్న ఆ పార్టీకి పునర్విభజన లెక్కలు సానుకూలంగా ఉన్నాయనేది గమనార్హం. అయితే, దక్షిణాది ప్రాతినిధ్యం తరుగుదల సమస్యను పరిష్కరిస్తామని కేంద్రం చెప్తున్నది. అది ఎలా అనేది మాత్రం ఇప్పటిదాకా స్పష్టత రాలేదు.*

# ఆకుపచ్చని తెలంగాణ ఆగమైపోతున్నది

**ఈ మధ్యకాలంలో ప్రజాకవి గోరటి వెంకన్నతో కలిసి తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కలిశాను. నేను రాసిన 'పిట్టవాలిన చెట్టు' పుస్తకాన్ని వారికి అందజేశాను. ఆ సందర్భంలో తెలంగాణ జల వనరుల మీదికి చర్చ మళ్లింది. నల్లమల నట్టడవిలో గద్దరాసి వాగు ఉన్నది. కనీసం ఆరు నెలలు పారుతుంది. మూడు నెలలు నిండుగా ప్రవహిస్తుంది. అడవిలో సెలయేర్లు, వాగులు, వంకలతో కలిసి చివరికి కృష్ణా నదిలో కలుస్తుంది. నాకు తెలిసి చెంచులకు మినహా జన దృష్టానికి అంతు దొరకని వాగు ఇది. కానీ, ఈ వాగును కేసీఆర్ ప్రస్తావించటం చూసి ఆశ్చర్యపోయాను. గద్దరాసి గుండ్ల దగ్గర కట్టేస్తే.. నీళ్లు ఆగుతయి. అమ్రాబాద్, అచ్చంపేట మండలాలకు నీళ్లు అందుతయి కానీ, అటవీ శాఖ అనుమతించదని చెప్పటం చూసి నోరెళ్లబెట్టాను. ఇది తెలంగాణ జల వనరుల మీద కేసీఆర్‌కు ఉన్న పట్టు.**



**వర్ధెల్లి వెంకటేశ్వర్లు**



ఇక గోదావరినైతే ఇంచు ఇంచు కొలత పెట్టినట్టే చీలే పాయలు.. పారే వాగులు.. కలిసే కాల్వలు.. దునికే జలపాతాలు ఇలా ఆయన ఒడిసిపట్టని నీటి చుక్క లేదు. 'తుమ్మిడి హెట్టి' ప్రాణహిత పుట్టిల్లు. వైన్‌గంగా, వార్ధా నదులు కలిస్తే అది ప్రాణహిత. అటు గడ్చిరోలీ జిల్లా ఇటు ఆదిలాబాద్ జిల్లా సరిహద్దుకు కచ్చితంగా కొలత పెట్టినట్టే కట్టుబడి 113 కిలోమీటర్ల ఇరుకు ప్రవాహం. అట్లా వచ్చి కాళేశ్వరం వద్ద 170 అడుగుల వద్ద గోదావరి నదిలో కలుస్తుంది. సెంట్రల్ వాటర్ కమిషన్ ఆధ్వర్యంలో నిర్వహించే వాటర్ రిసోర్స్ ఇన్ఫర్మేషన్ సిస్టం లెక్కల ప్రకారం గోదావరి నదిలో ప్రవహించే నీటిలో ప్రాణహిత నది వాటా 34.87 శాతం. గోదావరి పరీవాహక ప్రాంతం విస్తీర్ణం 3.13 లక్షల చదరపు కిలోమీటర్లు కాగా.. అందులో 1.10 లక్షల చదరపు కిలో మీటర్లు ప్రాణహితదేనని అనర్గళంగా చెప్తూనే ఉన్నారు.

> **వేమ్నూరు బండల వాగు, మంథని బొక్కల వాగు, దామెరకుంట పెద్ద వాగు, ఉండెడ పిట్టిపోలి వాగు, పెద్దంపేట బండ వాగు, అన్నారం బండ్ల వాగు ఇట్లా గోదావరిలో కలిసే తీరొక్క వాగుల పేర్లు, వాటి ప్రవాహ జల సామర్థ్యం వివరిస్తుంటే.. కోటి ఎకరాల మాగాణి పచ్చబడ్డ సాదృశ్యం కండ్లముందు కదలాడింది.**

కాలచక్రం తిరిగింది. రెండు నెలలు ముందుకు సాగింది. వికారాబాద్ జిల్లా పూడూర్ వద్ద నేవీ రాడార్ స్టేషన్‌కు భూమిపూజా కార్యక్రమం. ఇప్పటి తెలంగాణ సీఎం మైకు అందుకున్నారు. 'మన నగరానికి, మన రాష్ట్రానికి మూడు వైపులా సముద్రం ఉన్నది. బంగాళాఖాతం, అరేబియా మహా సముద్రం' అని ప్రసంగిస్తుంటే..! తీరం ముందు ఆధారం అందని అన్నదాత విషణ్ణ వదనంతో వరదల్లో కొట్టుకు పోతున్నట్టు అనిపించింది. కోటి ఎకరాల మాగాణి తడి తప్పి సత్తెనాశనం కాబోతున్నట్టు తోచింది. ఏ నీళ్లు ఎక్కడ ఉన్నయి? ఏ జలరాసుల పారగమ్యత పదునెంత? ఎరగని నేతలు అదను మీద పంట చేలకు నీళ్లిస్తారనుకోగలమా? ఈ అవగాహన రాహిత్యంతోనే కదా.. మేడిగడ్డలో తలెత్తిన లోపాన్ని ఏదో ఉపద్రవ విభ్రమకులోనై యావత్తు కాళేశ్వరం విధ్వంసానికి పూనుకున్నది. రెండు పిల్లర్లు కుంగితే మొత్తం ప్రాజెక్టునే పడావు పెట్టినంత పని చేసింది. కాళేశ్వరం ఏమైనా ఆషామాషీ ప్రాజెక్టా? ప్రపంచంలోనే సంక్లిష్ట, ఉత్కృష్టమైన మహా జల భాండాగారం. ఇంత పెద్ద ప్రాజెక్టుకు ఏటేటా నిర్వహణ, నిర్మాణ చిక్కులు ఉత్పన్నం కావటం అతి సహజం. నీళ్ల బరువు బాధ్యతలు తెలిసిన పాలకులైతే జలరంగ నిపుణులతో పరిశీలన చేయించి పరిష్కారాలను అన్వేషిస్తారు. ఇక్కడో సంఘటన గుర్తుచేయాలి.

1996లో ఇదే మేడిగడ్డ వద్ద ఒకేసారి 28 లక్షల క్యూసెక్కుల వరద ప్రవాహం వచ్చింది. మళ్లీ 36 ఏండ్ల తర్వాత అంటే.. 2022లో గోదావరి చరిత్రలోనే అంతటి హయ్యెస్ట్ ఫ్లడ్ వచ్చింది. రికార్డు స్థాయిలో 28.40 లక్షల క్యూసెక్కుల వరద పారింది. ఇంతకు మించిన ఉగ్ర గోదావరి రూపం మన తరం చూడలేదు. అంతటి మహోగ్ర గోదారమ్మకే అడ్డం నిలబడిన కాళేశ్వరం రైతాంగానికి నీళ్లందించింది. జల యుద్ధంలో కాళేశ్వరం గాయపడ్డ మాట నిజం. కట్టుగడితే నయమైపోయే చిన్న గాయాలకే ప్రాజెక్టును గొంతు నులుమజూడటం.. మూడు సముద్రాల ముచ్చట చెప్పటం రెండూ ఒక్కటే. అవగాహన రాహిత్యపు తాను ముక్కలే.

నదుల అనుసంధానాన్ని కేంద్రం వేగవంతం చేసింది. గోదావరిలోని తెలంగాణ వాటాలో 530 టీఎంసీల నీళ్లను ఆంధ్రకు, తమిళనాడుకు తరలించాలని ప్రణాళిక రూపొందించింది. ఒడిశా రాష్ట్రంలోని మహానదిలో 360 టీఎంసీలు, గోదావరిలో 530 టీఎంసీలు మొత్తం కలిసి 890 టీఎంసీల మిగులు జలాలున్నాయని కేంద్ర జలసంఘం లెక్కలు చెప్తున్నది. మహానదిని గోదావరితో కలిపి, గోదావరిని కృష్ణా నది మీదుగా కర్ణాటక, తమిళనాడు సరిహద్దుల్లో ఉన్న కావేరి నదికి అనుసంధానం చేయాలనేది ప్రతిపాదన. తెలంగాణకు 954 టీఎంసీల వాటా ఉండగా.. నిర్మించిన ప్రాజెక్టులు, నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టుల సామర్థ్యం కలిపి 684 టీఎంసీల జలాలే వాడుకుంటున్నారని, మిగిలిన 270 టీఎంసీల నీళ్లు మిగులు జలాలే అని కేంద్ర జల సంఘం చెప్తున్నది. మాకు మిగులు జలాలు లేవు, మీ లెక్కలు తప్పు అని కేంద్రంతో కొట్లాడే దమ్ము ఇప్పటి పాలకులకు ఎవరికి ఉంది? చంద్రబాబు పంపిన జల సలహాదారుడు ఆయన్ను కాదని మనకు సలహాలు ఇస్తారా? తీరమేదో.. పరీవాహకం ఏదో ఎరుక లేని నేతలు కేంద్రంతో పోటీ పడి మన నీళ్లు మనకు నిలుపగలరా? ఈ నీతిహీనమైన లెక్కలకు పొరుగు రాష్ట్రం ముఖ్యమంత్రి చంద్రబాబు వత్తాసు. రాజోలి బండ నీళ్లు ఆంధ్రకు మళ్లించి, తెలంగాణలో రక్తం పారించిన చరిత్ర ఆయనది. ఆయనకు మన ప్రస్తుత పాలకులు లాలూచీ. కృష్ణా నదిలో 79 శాతం పరీవాహక ప్రాంతం తెలంగాణలోనే ఉన్నది. అంటే, ముప్పావు వంతు జలాల వాటా తెలంగాణకు దక్కాలే. కృష్ణా నది నీటి లభ్యత 811 టీఎంసీలు. ఈ లెక్కన కనీసం 600 టీఎంసీలు తెలంగాణకు రావాలే. కానీ, అప్పటి హైదరాబాద్ ప్రభుత్వం తెలంగాణకు 161 టీఎంసీలు కేటాయించింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడ్డాక ఈ వాటాను 111కు కుదించింది. పోయిన నీళ్లు ఎలాగూ పోయాయి, కనీసం ఉన్న గోదావరి జలాలనైనా పొతం చేసుకుందామని తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ నిద్ర లేని రాత్రుల్లో కసరత్తులే చేసిండు. అందులోంచి రూపం పోసుకున్నదే కాళేశ్వరం... మహా జళేశ్వరం.

> **కాళేశ్వరం ప్రాజెక్టును ఎండబెట్టాలనేది కేంద్రం కుట్ర. దాన్ని ఆనందంగా అమలు చేస్తున్నది మన పాలకులు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే గోదావరి జలాల వినియోగం పక్కాగా డిజైన్ చేశారు. నిర్మాణం పూర్తయిన ప్రాజెక్టు కింద 433.04 టీఎంసీలు, నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టుల కింద 475.79 టీఎంసీలు, చేపట్టబోయే ప్రాజెక్టుల కింద 45.38 టీఎంసీలు మొత్తం కలిపి 954 టీఎంసీల జలాలను సంపూర్ణంగా వినియోగించుకునేటట్టు పటిష్ఠ ప్రణాళిక చేసి పెట్టారు. కాళేశ్వరం ప్రాజెక్టు ఉన్నంతకాలం గోదావరిలో మన వాటాను దాటి చుక్క నీళ్లు బయటికి జారవు. అందుకే, కేంద్రం గుర్రు మీదున్నది. ప్రాజెక్టు కూలాలనే చూస్తున్నది.**

కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో పనిచేసే జల రంగ సంస్థలు రేపొద్దున కాళేశ్వరంను బూచిగా చూపినా ఆశ్చర్యపడాల్సిన అవసరం లేదు. మేడిగడ్డ వద్ద రెండు పిల్లర్లు కుంగిన సాకు నేపథ్యంలో కేంద్ర జల రంగ సంస్థ ఒకటి నాణ్యతా నిర్ధారణ పరీక్షలు చేస్తున్నది. వాస్తవానికి ఈ సంస్థకు సంబంధించిన పూర్తి నివేదిక డిసెంబర్ లేదా జనవరి మాసాల్లో వస్తుంది. కానీ, అప్పుడే ఆ సంస్థ నుంచి లీకులు బయటికి వస్తున్నాయి. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల మూడు బరాజులు కూడా సీకెంట్ పైల్ ఫౌండేషన్ పరిజ్ఞానంతో కట్టినవే కాబట్టి, ఒకదాంట్లో పిల్లర్లు కుంగిపోయాయి కాబట్టి, నీళ్లు నిల్వ చేస్తే మూడు బరాజుల్లో కూడా అదే తీరు ప్రమాదం జరగవచ్చని మీడియా లీకులు వదులుతున్నది. ఈ లీకుల వెనుక కేంద్ర ప్రభుత్వ కుట్ర ఉన్నది. కాళేశ్వరం కూలిపోతే.. ఇచ్చంపల్లి వద్ద ఇంకో ప్రాజెక్టు కట్టి, అక్కడినుంచి గోదావరి నదిని మళ్లించి కృష్ణకు కలపాలనేది అసలు పన్నాగం. దీనికోసం అటు కేంద్ర ప్రభుత్వం, ఇటు పొరుగు రాష్ట్రం ముఖ్యమంత్రి సంయుక్తంగా ఎత్తులు వేస్తున్నారు. ఈ కపట నాటకాన్ని పసిగట్టేది ఎవరు? ఆపేదెవరు? మన పాలకులకు జల పరిజ్ఞానం ఉండి ఉంటే.. ఏ నది జలాలైనా ప్రస్తుత, సమీప భవిష్యత్తు పరీవాహక ప్రాంత అవసరాలను తీర్చాలి. అంటే కేవలం ఇప్పటికి మాత్రమే కాదు, మరో 30 ఏండ్ల నాటికి పెరుగనున్న జనాభా, వారికి అవసరమైన నీటి పరిమాణాన్ని నిర్ధారించి లెక్కగట్టినంకనే మిగులు జలాలను అంచనా వేయాలని వాదించేవాళ్లు. రెండు పండ్లు విరిగినట్టున్న మేడిగడ్డకు కట్టుగట్టి కాపాడుకునేవారు. కానీ, కేసీఆర్ కాకుండా ఇంకెవరికైనా ఇది సాధ్యమా? బాపుకున్న నెమ్మితనం బయటోళ్లకు ఉంటదా? 'మంది మాటలు వట్టి మార్వానం పోతే మల్లొచ్చేసరికి ఇల్లు ఆగమైనట్టు' అయింది తెలంగాణ జనం సంగతి.

నీళ్ల సంగతి అటుంచి నియామకాలు చూద్దామంటే.. ఏమన్న సక్కదనం ఉన్నదా? బడుగు బలహీన బహుజన పిల్లలకు పెద్ద ఉద్యోగాలు అందకుండా జీవోలు తెచ్చింది ఎవరు? ఈ జీవోలు తేవటం కోసమా మనం ఓట్లేసింది. మా కొలువులు మాకు కావాలని కొట్లాడుతున్న మన పిల్లలను హైదరాబాద్ పోలీసులు గుత్ప కర్రలందుకొని గొడ్డును బాదినట్టు బాదుతుంటే.. చూస్తూ గుండెలు బాదుకోవటం మినహా ఏం చేయగలుగుతున్నం. పాలిచ్చే ధేనువు తల్లిగిడిసి మనమేం బావుకున్నట్టు? ఇవా.. మనం కోరుకున్న బతుకులు? జనం, విద్యావంతులు ఒక్కసారి ఆలోచన చేయాలె. బంగారు తున్క తీరు ఆకుపచ్చ తెలంగాణ ఆగం పాలైపోతంది. పంట పొలానికి నీళ్లు నింపే నీరటి ఎవరో? పొట్ట మీది చేనుకు తడి తప్పించే తలారి ఎవరో? మనకు మనమే అంచనా వేసుకోవాలె. నీళ్ల కాడ, నియామకాల కాడ వాచ్ డాగ్ తీరుగా ఉండి కొట్లాడి నిలబెట్టిన నేత మీదికే రాళ్లు విసిరితిమి. ఇదేమంటే.. అహం అంటగడితిమి. దగాకోరు మాటలకే పట్టం గడితిమి. ఇప్పుడు గోస పడుతుంటిమి. ఇంకనైనా కండ్లు తెరిసి కర్తవ్యబోధ చేసుకోవద్దా?


> **ఏ నీళ్లు ఎక్కడ ఉన్నయి? ఏ జలరాసుల పారగమ్యత పదునెంత? ఎరగని నేతలు అదను మీద పంట చేలకు నీళ్లిస్తారనుకోగలమా? ఈ అవగాహన రాహిత్యంతోనే కదా.. మేడిగడ్డలో తలెత్తిన లోపాన్ని ఏదో ఉపద్రవ విభ్రమకులోనై యావత్తు కాళేశ్వరం విధ్వంసానికి పూనుకున్నది. రెండు పిల్లర్లు కుంగితే మొత్తం ప్రాజెక్టునే పడావు పెట్టినంత పనిచేసింది. కాళేశ్వరం ఏమైనా ఆషామాషీ ప్రాజెక్టా? ప్రపంచంలోనే సంక్లిష్ట, ఉత్కృష్టమైన మహా జల భాండాగారం.**

# 'మహా' పీఠం దక్కేదెవరికో?

**మహారాష్ట్రలో ఐదేండ్లుగా జరుగుతున్న రాజకీయ ట్విస్టులు, టర్నులూ... ఒక సూపర్ హిట్ పొలిటికల్ థ్రిల్లర్‌ను తలపిస్తున్నాయి. చీలికలతో చెల్లాచెదురైన పార్టీల మధ్య త్వరలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికలు కూడా అంతే ఉత్కంఠగా సాగనున్నాయని ప్రస్తుత పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే శివసేన, అజిత్ పవార్ ఎన్సీపీలతో కలిసి బీజేపీ 'మహాయుతి' కూటమిగా, మాజీ ముఖ్యమంత్రి ఉద్ధవ్ ఠాక్రే శివసేన, శరద్ పవార్ ఎన్సీపీలతో కలిసి కాంగ్రెస్ పార్టీ 'మహా వికాస్ అఘాడి' కూటమిగా ఈ ఎన్నికల్లో ఆరు పార్టీలు రెండు శిబిరాలుగా ఎన్నికల రణక్షేత్రంలోకి దిగుతున్నాయి. పలు పార్టీలు, ఉప పార్టీల మధ్య పెరిగిన ఈ ఆధిపత్య పోరులో పీఠం దక్కేదెవరికి అన్నదొక సంక్లిష్టమైన ప్రశ్న! దేశంలో భౌగోళికంగా, సాంస్కృతికంగా, ఆర్థికంగా, చారిత్రకంగా ఎంతో ప్రత్యేకత కలిగిన మహారాష్ట్రలో నెలకొన్న పరిస్థితులను పీపుల్స్ పల్స్ రీసెర్చ్ సంస్థ క్షేత్రస్థాయిలో అధ్యయనం చేస్తున్నపుడు ఆసక్తికర అంశాలు తెరపైకి వస్తున్నాయి.**



**జి.మురళీ కృష్ణ**
99668 33329



మహారాష్ట్రలో ఉన్న భిన్న రాజకీయ పరిస్థితుల వల్ల ఒక్కో ప్రాంతంలో ఒక్కో పార్టీ బలంగా ఉండటంతో ఏ పార్టీకి స్పష్టమైన ఆధిక్యం వచ్చే అవకాశాలు లేవు. అందుకే, ప్రధాన పార్టీలు కూటములుగా తలపడుతున్నాయి. 1995 తర్వాత ఇక్కడ కాంగ్రెస్ పార్టీ ప్రాబల్యం తగ్గడం ప్రారంభమైంది. 1999 నుంచి 2009 మధ్య జరిగిన మూడు అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్, శరద్ పవార్ నేతృత్వంలోని నేషనల్ కాంగ్రెస్ పార్టీ కలిసి వరుసగా మూడు పర్యాయాలు బీజేపీ-శివసేన కూటమిని ఓడించి అధికారంలోకి వచ్చింది. అయితే, 2014 ఎన్నికల్లో బీజేపీ అత్యధిక స్థానాలు గెలిచి అతిపెద్ద పార్టీగా అవతరించడంతో కాంగ్రెస్ పార్టీ పతనం మొదలైంది. మరోవైపు తన భాగస్వామి ఎన్సీపీ కూడా పలు సంప్రదాయ సామాజిక వర్గాల్లో మద్దతు కోల్పోవడంతో ఈ కూటమి అధికారానికి దూరమైంది.

బీజేపీ, శివసేన కలిసి పోటీ చేసి 2019 అసెంబ్లీ ఎన్నికల్లో 42 శాతం ఓట్లు సాధించాయి. అయితే ఫలితాల తర్వాత ప్రభుత్వ ఏర్పాటులో భాగంగా పొత్తు ధర్మం ప్రకారం ముఖ్యమంత్రి పీఠాన్ని రెండున్నరేండ్లు ఇస్తామని చెప్పిన బీజేపీ మాట తప్పుతున్నదని ఆరోపిస్తూ బీజేపీతో శివసేన తెగదెంపులు చేసుకున్నది. అదే క్రమంలో కాంగ్రెస్, ఎన్సీపీలతో చేతులు కలిపి ఉద్ధవ్ ఠాక్రే ముఖ్యమంత్రి అయ్యారు. కాంగ్రెస్‌తో చేతులు కలపడంతో ఉద్ధవ్ ఠాక్రే సిద్ధాంతాలు ఆయన తండ్రి బాలాసాహెబ్ ఠాక్రే కంటే భిన్నమైనవని తేలింది.

2017 బీఎంసీ ఎన్నికల్లో ఉద్ధవ్ ఠాక్రే శివసేన తరపున ముస్లిం అభ్యర్థులను కూడా బరిలోకి దించింది. అందులో ఇద్దరు గెలిచారు కూడా! శివసేన 2019లో కాంగ్రెస్, ఎన్సీపీలతో చేతులు కలిపిన తర్వాత ఉద్ధవ్ ఠాక్రే సిద్ధాంతాల మీద మరింత స్పష్టత ఏర్పడింది.

> **ఉద్ధవ్ ఠాక్రే, ఆయన కుమారుడు ఆదిత్య ఠాక్రే ఇద్దరూ బాలాసాహెబ్ శివసేన సిద్ధాంతాలకు వ్యతిరేకంగా పని చేస్తున్నారని ఆరోపిస్తూ 2022 జూన్‌లో ఆ పార్టీ నాయకుడు ఏక్‌నాథ్ షిండే రెబెల్ ఎమ్మెల్యేలతో శివసేనను చీల్చి బీజేపీతో చేతులు కలిపారు.**

నెల రోజుల తర్వాత అజిత్ పవార్ కూడా ఎన్సీపీని చీల్చి బీజేపీ పంచన చేరడంతో మహా వికాస్ అఘాడి ముఖ్యమంత్రి ఉద్ధవ్ ఠాక్రే కుర్చీ దిగిపోయారు. ఆ సమయంలో ఏక్‌నాథ్ షిండే ముఖ్యమంత్రి కాగా, ఫడ్నవీస్ ఉప ముఖ్యమంత్రి అయ్యారు. ఏక్‌నాథ్ షిండే శివసేన పార్టీని కూడా హస్తగతం చేసుకున్నారు. అజిత్ పవార్ కూడా ఎన్సీపీని చీల్చి తమదే అసలు ఎన్సీపీ అని ప్రకటించుకున్నారు.

నాయకులు అధికారం కోసం పార్టీలను చీల్చడం ప్రజలకు మాత్రం నచ్చలేదని 2024 లోక్‌సభ ఎన్నికల్లో స్పష్టమైంది. ఈ ఎన్నికల్లో చీలికలకు కారణమైన బీజేపీ, షిండే శివసేన, అజిత్ పవార్ ఎన్సీపీల మీద తమ అసంతృప్తిని చూపించారు. ఉద్ధవ్ ఠాక్రే శివసేన తమ పార్టీ బలంగా ఉన్న 21 ఎంపీ స్థానాల్లో పోటీ చేసింది. కాంగ్రెస్ పటిష్ఠంగా ఉన్న విదర్భ, మరత్వాడా ప్రాంతాల్లోని 17 సీట్లలో పోటీ చేసింది. ఉత్తర, పశ్చిమ మహారాష్ట్రల్లో బలంగా ఉన్న 10 స్థానాల్లో శరద్‌పవార్ ఎన్సీపీ పోటీ చేసింది. మహా వికాస్ అఘాడి తమ బలాబలాలకు అనుగుణంగా పోటీ చేయడంతో వాటి మధ్య ఓట్ల బదిలీ సక్రమంగా జరిగింది. మహాయుతి కూటమి ప్రాంతీయ బలాబలాలను పట్టించుకోకుండా సీట్లను పంచుకోవడం, ఎన్నికల్లో ఉద్ధవ్‌పై వచ్చిన అవినీతి ఆరోపణలను ప్రస్తావించకుండా షిండే సాధించిన విజయాల ను ప్రచారం చేయడంతో మహాయుతి మూల్యం చెల్లించుకున్నది.

2024 లోక్‌సభ ఎన్నికలను బట్టి అసెంబ్లీ స్థానాల్లో పరిశీలిస్తే రాష్ట్రంలోని 288 స్థానాల్లో కాంగ్రెస్ కూటమి 151 స్థానాల్లో, బీజేపీ కూటమి 128 స్థానాల్లో ఆధిక్యత ప్రదర్శించాయి. ఇండియా కూటమికి 43.71 శాతం ఓట్లు రాగా, ఎన్డీయే కూటమికి 43.55 శాతం ఓట్లు వచ్చాయి. ఈ స్వల్ప తేడానే, మొత్తం 48 లోక్‌సభ స్థానాలకు గాను ఇండియా కూటమి 30 స్థానాలు గెలుచుకోగా, ఎన్డీయే కూటమి 17 సీట్లకు పరిమితమైంది. ఇండిపెండెంట్‌గా గెలిచిన ఒక కాంగ్రెస్ రెబెల్ అనంతరం తిరిగి హస్తం గూటికి చేరారు. 2019తో పోలిస్తే ఈసారి ఎన్డీయే కూటమి 8 శాతం ఓట్లు కోల్పోగా, ఇండియా కూటమి 12 శాతం ఓట్లు పెంచుకున్నది. 2019లో బీజేపీకి 28 శాతం ఓట్లు రాగా, 2024లో అది 26 శాతానికి తగ్గింది. సీట్లు పెంచుకున్న కాంగ్రెస్ కూడా గత ఎన్నికల్లో 16 శాతం ఓట్లు పొందగా, ఈసారి ఒక్క శాతమే పెంచుకొని 17 శాతానికి పరిమితమైంది. పార్టీలో వచ్చిన చీలిక కారణంగా అధికారం కోల్పోయిన ఉద్ధవ్ పట్ల సానుభూతి, కొవిడ్ సమయంలో ఆయన చేసిన పనులపై ప్రజలు సానుకూలంగా ఉండటం 'ఇండియా' కూటమికి ఎన్నికల్లో మేలు చేసింది.

> **విదర్భ, పశ్చిమ మహారాష్ట్ర, మరత్వాడా ప్రాంతాల్లో ఎన్డీయే కూటమి ఒక్క ఎంపీ సీటు కూడా గెలవలేకపోయింది. ఈ ప్రాంతంలో మరాఠాలు బీజేపీకి దూరంగా జరిగారు. మహారాష్ట్ర రాజకీయాలు మరాఠాల ఆధిపత్యానికి ప్రసిద్ధి. మహారాష్ట్రలో ఈసారి గెలిచిన ఎంపీల్లో సగం మంది మరాఠా కులం వాళ్లే! మరాఠా రిజర్వేషన్ల ఉద్యమంతో అన్ని పార్టీలూ మరాఠాలకే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నాయి. అయితే, ఈ రిజర్వేషన్లపై బీజేపీ ధోరణి ఎన్డీయే కూటమికి ప్రతికూలంగా మారింది. మరోవైపు ముంబై, కొంకణ్, ఠాణే ప్రాంతాల్లో షిండే శివసేన ప్రభావం బలంగా ఉండటం వల్ల బీజేపీకి ఓటమి తప్పింది.**

మహారాష్ట్ర ఆర్థికంగా బలమైన రాష్ట్రంగా ఎప్పుడూ వార్తల్లో ఉంటుంది. అయితే, నిరుపేదలకు, కింది కులాలకు సరైన న్యాయం జరగలేదని ఆ వర్గాలు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలపై తీవ్ర అసంతృప్తిగా ఉన్నాయి. దీంతో లోక్‌సభ ఎన్నికల్లో భంగపాటు తర్వాత మహాయుతి అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని పలు ఆకర్షణీయ పథకాలను ప్రకటించింది. ఐదు నెలల కింద పార్లమెంట్ ఎన్నికల్లో మహాయుతికి వ్యతిరేకంగా తీర్పు ఇచ్చిన రాష్ట్ర ఓటర్లు ఈ పథకాలపై ఎలా స్పందిస్తారో? అంతే కాకుండా ఈ ఎన్నికల అనంతరం అసలైన శివసేన ఎవరిదో? అసలైన ఎన్సీపీ ఏదో? తేలడం ఖాయం!

(వ్యాసకర్త: రీసెర్చర్, పీపుల్స్ పల్స్ రీసెర్చ్ సంస్థ)

**న్యాయదేవత అంటే కండ్లకు గంతలు కట్టుకొని, ఒక చేతిలో ఖడ్గం, మరో చేతిలో సమానంగా ఉండే త్రాసు పట్టుకొని ఉంటుందని మనందరికీ తెలిసిందే! న్యాయదేవత విగ్రహంలో కొన్ని మార్పులు చేసి సుప్రీంకోర్టు గ్రంథాలయంలో ఉంచినట్లు ఈ మధ్య పత్రికల్లో వచ్చింది. ఆ విగ్రహంలో న్యాయదేవత కండ్లకు అడ్డంగా ఉండే గుడ్డని తొలగించి, చేతిలో ఖడ్గానికి బదులు రాజ్యాంగం పుస్తకాన్ని పట్టుకున్నట్టు మార్పులు చేశారు. ఆ మార్పులు సుప్రీం ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ సూచనల మేరకు జరిగినట్టు తెలుస్తున్నది. దానికి ఆయన ఇచ్చిన వివరణ కూడా మీడియాలో వచ్చింది. 'న్యాయాన్యాయాల నిర్ధారణలో హింసకు తావులేదు. తీర్పులు రాజ్యాంగంలో సూచించిన నిర్దేశాల ఆధారంగానే ఉంటాయి. కావున నేటి న్యాయదేవత చేతిలో ఖడ్గానికి బదులు రాజ్యాంగం ఉండటమే సబబు' అని ఆయన అంటున్నారు.**

# కండ్లు తెరిచిన న్యాయదేవత



**నర్సన్ బద్రి**
9440 128169



న్యాయం గుడ్డిది అనే అపవాదు ప్రచారంలో ఉన్నదని, అది తప్పని.. కండ్లారా అన్ని పరిశీలించాకే తీర్పు ప్రకటించడం జరుగుతున్నదనే స్పష్టత కోసం విగ్రహం కండ్లకు అడ్డంగా గుడ్డ అవసరం లేదని సీజేఐ డీవై చంద్రచూడ్ భావన. మరో ప్రధానమైన మార్పు ఏమిటంటే విగ్రహంలో న్యాయదేవత ధరించే నిలువుపాటి వస్త్రానికి బదులుగా హైందవ స్త్రీ మాదిరి చీర కట్టును ఏర్పాటుచేశారు. పాశ్చాత్య దుస్తులతో కాకుండా దేశీయ కట్టుబొట్టుతో ఉండాలనే ఆయన ఆలోచన న్యాయదేవత ఆహార్యంలోనూ మార్పును తెచ్చింది.

న్యాయదేవత విగ్రహ వాడకం ఒక ఆనవాయితీగా మారింది తప్ప దాని విషయంలో ఎలాంటి ప్రభుత్వ ఉత్తర్వులు గాని, చట్టపర ఆదేశాలు గాని లేవు. అందుకే ఇన్నాళ్లుగా వాడుకలో ఉన్న రూపానికి సీజేఐ తన ఇష్టానుసారంగా మార్పులు సూచించి, అలా రూపొందించిన విగ్రహాన్ని కోర్టు లైబ్రరీలో పెట్టించారు. అయితే, గౌరవ న్యాయమూర్తి చేపట్టిన ఈ మార్పుల పట్ల మాత్రం కొన్ని విమర్శలు వస్తున్నాయి.

సర్వసమ్మతమై, విశ్వ ప్రాచుర్యంలో ఉన్న ఒక రూపానికి ఎవరికి తోచిన మార్పులు వారు చేయడం అంగీకారం కాదనేది అధికంగా వ్యక్తపరిచిన ప్రధాన అభ్యంతరం. అసలు ఆ రూపంలో మార్చాల్సిన అంశమేదీ లేదు, ప్రతి అంశానికి ఒక లోక ప్రయోజక సూచన ఉన్నదనేవారు కూడా ఉన్నారు. కండ్లకు ఉండే గంతలు తొలగించడంపై తీవ్ర వ్యతిరేకత వస్తున్నది. న్యాయం కోసం వచ్చినవారు ఎలాంటి వారు, చూడటానికి వాళ్లు ఎలా ఉన్నారనే విషయం అప్రస్తుతం. వారి రూపురేఖలు, ఆహార్యం, హావభావాలు, రాగద్వేషాలు తీర్పును ప్రభావితం చేయవద్దనే ఉద్దేశంతోనే న్యాయదేవత కండ్లు కప్పుకొంటుంది. అప్పుడే తీర్పు నిష్పక్షపాతంగా ఉంటుందనేది అందరు ఒప్పుకొనే సత్యం. జాన్ రాల్స్ అనే అమెరికన్ సామాజిక తత్వవేత్త న్యాయదేవత ముసుగు ఆవశ్యకత గురించి 'థియరీ ఆఫ్ జస్టిస్' అనే గ్రంథంలో విస్తారంగా చర్చించారు. తాను ఎవరికి న్యాయం చెప్తున్నానో తెలియనప్పుడే తీర్పు నిక్కచ్చిగా ఉంటుంది.

కండ్లకు గంతలు ఉన్నప్పుడే త్రాసు సమతూకంగా ఉంటుందనేది శాస్త్రీయ ఆలోచన అని రాశారు. ప్రభుత్వాలు, న్యాయస్థానాలు సొంత ప్రయోజనాల కోసం కోర్టు తీర్పులను ప్రభావితం చేయవద్దనే సందేశం అందులో దాగి ఉన్నదని అన్నారు. న్యాయదేవత చేతిలో ఉండే ఖడ్గం రెండు వైపులా పదును గల ఆయుధం, నేరం చేసినవాడు ఏ వైపు నుంచి కూడా శిక్షను తప్పించుకోలేడనే సంకేతం అందులో ఉన్నదని వివరించారు.

ప్రపంచవ్యాప్తంగా ఆమోదించబడి, న్యాయానికి చిహ్నంగా వాడబడుతున్న ఈ విగ్రహానికి శతాబ్దాల చరిత్ర ఉన్నది. గ్రీకు దేవత జస్టిసియా రూపం దీనికి మూలం. అప్పటికే ఆమె బొమ్మను రోమన్ నాణేలపై, న్యాయపత్రాలపై వాడేవారు. ఆమె చేతిలో త్రాసు ఉండటంతో ఆ రూపాన్ని న్యాయదేవతగా స్వీకరించడం జరిగింది. 16వ శతాబ్దంలో కండ్లకు అడ్డంగా గుడ్డ కట్టిన రూపం వాడుకలోకి వచ్చింది. అప్పటినుంచి ఆ విగ్రహంలో త్రాసు సమన్యాయానికి, కత్తి శిక్షించే అధికారానికి, గంతలు నిష్పక్షపాతానికి గుర్తుగా ఉంటున్నాయి.

> **బ్రిటిష్ కాలం నుంచి మన దేశంలో ఈ విగ్రహాన్ని కోర్టు హాల్‌లలో, న్యాయ కళాశాలల్లో, మ్యూజియం, పార్కుల్లో వాడుతున్నారు. న్యాయవాద వృత్తుల్లో కొనసాగేవారి ఇండ్లలో కూడా కనబడుతున్నది. సుదీర్ఘ చరిత్ర, విశ్వవ్యాప్తి గల విగ్రహానికి చేపట్టిన మార్పులు ఇప్పుడు అందరిని సందిగ్ధంలో పడేశాయి. ఈ విమర్శ మెల్లగా జస్టిస్ చంద్రచూడ్ పైకి మళ్లింది.**

సెప్టెంబర్ 12న గణపతి పండుగ సందర్భంగా ప్రధాని మోదీ స్వయంగా జస్టిస్ చంద్రచూడ్ ఇంటికి వెళ్లి పూజలో పాల్గొనడం ఒక చర్చకు దారితీసింది. వచ్చే నెల 11 నాడు పదవీ విరమణ ఉన్నందున భవిష్యత్తులో ప్రభుత్వ పదవుల కోసం ముందస్తుగా మోదీని తృప్తిపరచే ప్రణాళికలోకి ఈ మార్పులు వస్తాయని నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికే కోర్టు తీర్పులు అధినేతల ఆదేశాలకు ప్రభావితమవుతున్నట్టే ఉంటున్నాయి. ఇక న్యాయదేవత కండ్లు తెరిచి చెప్పే తీర్పులు ఇంకెలా ఉంటాయో చూడాలి.